క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా సమ్మయ్య



సమ్మయ్యను సన్మానిస్తున్న ఉద్యోగులు

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్. సమ్మయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నిరంతరం పోరాడాలి



సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్, తదితరులు

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్ దంపతులను సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఐదేళ్ల పదవీకాలంలో హుజూరాబాద్ అభివృద్ధిని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి కేటీఆర్‌కు వివరించారు. వీడ్కోలు పదవికి తప్పా ప్రజలకు కాదని, ఎల్లప్పుడూ మధ్య ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలని వినతి



హరికృష్ణకు వినతిపత్రం ఇస్తున్న స్వామి

చిగురుమామిడి: రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషిచేయాలని మాజీ జెడ్పీటీసీ, తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర కోశాధికారి అందె స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల కళాకారులు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర తెలుగు భాషా సంచాలకుడు మామిడి హరికృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. పలు విషయాలను హరికృష్ణ సానుకూలంగా విని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని స్వామి తెలిపారు. వెంట ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా, రాష్ట్ర అధ్యక్షుడు బోల్ల కొమురెల్లి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నాడి మల్లికార్జున్‌రెడ్డి, రవీంద్రాచారి, రాష్ట్ర కార్యదర్శి పెనుకుల తిరుపతి, సహాయకార్యదర్శి రాంచంద్రారెడ్డి, నా యకులు సత్యనారాయణ పలువురు ఉన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

మానకొండూర్: మానకొండూర్ నియోజకవర్గంలోని పలు గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ.13.18 కోట్లు మంజూరయ్యాయని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గంగిపల్లి నుంచి పచ్చునూర్ వయా కొండపల్కల వరకు బీటీ రోడ్డు, తిమ్మాపూర్ మండలంలో రామకృష్ణాకాలనీ–సుభాష్‌నగర్ నుంచి తిమ్మాపూర్, శంకరపట్నం మండలం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మెట్‌పల్లి మీదుగా బేతిగల్, ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ నుంచి అంతగిరి మీదుగా మెదక్ జిల్లా సరిహద్దు వరకూ, ముస్కాన్‌పేట నుంచి ఇల్లంతకుంట, వెంకట్రావుపల్లి మీదుగా మెదక్ జిల్లా సరిహద్దు వరకూ, సిరికొండ నుంచి దాచారం మీదుగా బోటిమీది పల్లెవరకూ, బెజ్జంకి మండలం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి చీలాపూర్, రేగులపల్లి మీదుగా కొత్తపల్లి వరకూ, అలాగే జిల్లా పరిషత్ రోడ్డు నుంచి గుండారం మీదుగా చీలాపూర్ వరకూ, బెజ్జంకి నుంచి రేపాక మీదుగా కల్లెపల్లి వరకూ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట: రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు వ్యవసాయనికి అనుకూలంగా లేని బంజరు భూముల్లో సౌరశక్తి ఉత్పత్తికి ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఎస్‌ఈ ఆదేశాల మేరకు జమ్మికుంట రూరల్ ఏఈ రమేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాడానికి రైతులు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, రైతు సమూహాలు, నీటి వినియోగదారుల సంఘాలు, స్వయం సహాయక బృందాలు, పంచాయతీలు, గ్రామ సంస్థలు, మండల సమైఖ్యలు, రైతు భూమి ఒప్పందం ద్వారా లీజు తీసుకున్నవారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని, టీజీఎన్పీడీసీఎల్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టీజీఈఆర్‌సీ) నిర్ణయించిన టారీఫ్ ప్రకారం ఉత్పత్తి చేయబడిన విద్యుత్తును కొనుగోలు చేస్తుందని తెలిపారు. బంజరు భూములు, వ్యవసాయానికి అనుకులంగా లేని భూములను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని, కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని ఏఈ పేర్కొన్నారు.



వీణవంక సొసైటీ కార్యాలయం

రుణమాఫీ కొందరికే..

- బ్యాంకులు, సొసైటీల చుట్టూ తిరుగుతున్న రైతులు
- రూ.2 లక్షల వరకు మాఫీ అంటూ ప్రభుత్వ ప్రకటనలు
- క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నం
- ఆందోళనలో అన్నదాతలు

వీణవంక: ప్రభుత్వం రూ.రెండు లక్షల రుణమాఫీ చేశామని ప్రకటించగా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. పూర్తి స్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. యాసంగి సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినా రైతుభరోసా అందక, రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల హామీలో భాగంగా విడుతల వారీగా రుణమాఫీ ఎందుకు కావడం లేదో రైతులతోపాటు బ్యాంకు అధికారులకు అర్థం కావడంలేదు. రూ.రెండు లక్షలపైగా రుణం ఉన్న రైతులు అసలే మాఫీ కాలేదని వాపోతున్నారు.

వీణవంక ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో 26 గ్రామాలు ఉన్నాయి. సంఘంలో 3,120 మంది సభ్యులు ఉన్నారు. 1070 మంది రైతులు రూ.10.20 కోట్ల వరకు రుణం తీసుకున్నారు. ఇప్పటి వరకు 559 మందికి మూడు విడుతలుగా రూ.5.20 కోట్ల రుణమాఫీ కాగా, ఇంకా 511మందికి రుణమాఫీ కావాల్సి ఉంది. కానీ ప్రభుత్వం రుణమాఫీ చేశామని ప్రకటన చేయడంతో మాఫీ కానీ రైతులు దిక్కుతోచన పరిస్థితిలో పడ్డారు. పాలకవర్గం సభ్యులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని డైరెక్టర్లు వాపోతున్నారు. సొసైటీలో ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులే రుణాలు తీసుకున్నారు. సొసైటీలోని కొందరు డైరెక్టర్లు, సిబ్బందికి కూడా మాఫీ కాలేదని తెలిసింది. రుణాల మంజూరు, ధాన్యం కొనుగోళ్లలో సొసైటీ కొంత కాలంగా ఆదర్శంగా నిలుస్తోంది. పాలకవర్గ సభ్యులు ధాన్యం కొనుగోళ్లలో చొరవ చూపడంతో సజావుగా జరుగుతున్నాయి. జాప్యం లేకుండా రుణాలు అందిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో రైతులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సొసైటీలోని రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో కూడా చర్చించాం. రుణం తీసుకున్నవారిలో చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేశామని ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి విరుద్ధంగా ఉంద. వీణవంక సొసైటీ ధాన్యం కొనుగోళ్లలో ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రి స్పందించాలని కోరుతున్నాం.

– కామిడి కావ్యశ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్



హుజూరాబాద్: మండలంలోని కనుకులగిద్దె–ధర్మరాజుపల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కన వ్యవసాయబావి ప్రమాదకరంగా ఉంది. బావి సమీపంలో ఎలాంటి హెచ్చరిక, సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
టి, సునీత, ఎంపీడీవో హుజూరాబాద్, సెల్‌నం: 99899 30709

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

యువత క్రీడలపై దృష్టిపెట్టాలి



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కళాశాల చైర్మన్

తిమ్మాపూర్: యువత డ్రగ్స్, మద్యానికి దూరంగా ఉండాలని, వివిధ క్రీడలపై దృష్టిపెట్టాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ విద్యార్థులు, యువత సూచించారు. తిమ్మాపూర్ మండలం వాగేశ్వరి కళాశాల ఆవరణలో శుక్రవారం నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చాలా సంస్థలు క్రీడలను దూరం పెట్టాయనే విషయాన్ని గుర్తు చేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఆటపాటలతో స్నేహ భావం పెంచుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు భవిష్యత్‌ను దెబ్బతీస్తున్నాయని యువత వాటిని మంచికే వినియోగించాలన్నారు. తల్లిదండ్రులకు పేరు వచ్చేలా ఎదగాలని సూచించారు. అనంతరం క్రీడా ప్రతిజ్ఞ చేయించి, వాలీబాల్ ఆడారు. కళాశాల చైర్మన్ గంగ్ర శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్ రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్, నెహ్రూ యువకేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ కౌసల్య సింగ్

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ తరగతులు కొనసాగాయి. టాస్క్ ట్రైనర్ డాక్టర్ కౌసల్యసింగ్ పోటీ పరీక్షలకు సంబంధించి అర్థమెటిక్, రీజినింగ్, మెంటల్ ఎబిలిటీ సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ హనుమకుమార్, వైస్ ప్రిన్సిపాల్ శనిగరపు రజిత, ప్లేస్‌మెంట్ అధికారి తాళ్లపల్లి అజయ్‌కుమార్, టాస్క్ కో ఆర్డినేటర్ మహేశ్ తదితరులున్నారు.

ఎన్‌సీసీ బుక్ ఆవిష్కరణ



బుక్ ఆవిష్కరిస్తున్న కళాశాల చైర్మన్, సెక్రటరీ, వివిధ విభాగాల అధిపతులు

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, ఎన్‌సీసీ అధికారి కల్లెం రవీంద్రబాబు రచించిన ఎన్‌సీసీ బుక్‌ను రాజ్యసభ మాజీ సభ్యుడు, కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతారావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్, వివిధ విభాగాధిపతులున్నారు.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

హుజూరాబాద్: హుజూరాబాద్ కారు డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సదానందం, గౌరవాధ్యక్షుడిగా గందె శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా ప్రతాప శ్రీనివాస్, వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా కొలిపాక సాయిరాం, కొండూరి కిరణ్, కార్యదర్శిగా కందుల స్వామి పటేల్, కోశాధికారులుగా మైస కరుణాకర్, ఆకుల విక్రమ్, కార్యవర్గ సభ్యులుగా బాబు, శరత్, తిరుపతి, నాగరాజు, రాజు, శ్రీనివాస్, వంశీ, భాస్కర్, సంపత్, సదానందం, నాగరాజు, విశాల్, రాజు, వెంకటేష్, చిట్టిమల్ల రాజు, శ్యామ్, బండ రమేశ్ ఎన్నికయ్యారు.

ఆత్మీయ సన్మానం



సన్మానిస్తున్న జాషువా,తదితరులు

జమ్మికుంట: పట్టణంలోని బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ జాషువా ఆధ్వర్యంలో మున్సిపల్ పదోవార్డు మాజీ కౌన్సిలర్ పొనగంటి విజయలక్ష్మి మల్లయ్యకు ఆత్మీయ సన్మానం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా మాట్లాడుతూ... ఐదేళ్ల పాలనలో వార్డులోని ప్రజల సమస్యల పరిష్కరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలు



హెచ్‌కేఆర్ ఆధ్వర్యంలో ర్యాలీ

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ శుక్రవారం హెచ్‌కేఆర్ టోల్‌గేట్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రయాణికులకు రోడ్డుప్రమాదాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపువారు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అందరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌కెఆర్ మేనేజర్ యగ్నేశ్వరరావు, టోల్‌గేట మేనేజర్ మహేందర్‌రెడ్డి, కిశోర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మానకొండూర్: డీటీఎఫ్ శంకరపట్నం మండల అధ్యక్షుడిగా బొప్పరాజు రమేశ్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శుక్రవారం డీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా డీటీఎఫ్ రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి, ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రమేష్, వసంత, కార్యదర్శులుగా కుమారస్వామి, శ్రీనివాస్, ఆడి ట్ కమిటీ కన్వీనర్‌గా రామేశ్వర్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా రవీంద్రనాథ్, సమ్మిరెడ్డి ,శివ ప్రసాద్, హుమేరా జబీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



గురువారెడ్డిని సన్మానిస్తున్న సీఈ సుధాకర్‌రెడ్డి

తిమ్మాపూర్: సేవలతోనే ప్రతి ఉద్యోగికి గుర్తింపు వస్తుందని కాళేశ్వరం సీఈ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఇరిగేషన్ సర్కిల్ కరీంనగర్ సూపరింటెండెంట్ పత్తి గురువారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమానికి సీఈ హాజరై మాట్లాడారు. ఉద్యోగకాలంలో చేసిన మంచి పనులే గుర్తింపునిస్తాయని, గురువారెడ్డి సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. గురువారెడ్డిని తోటి ఉద్యోగులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. డిప్యూటీ ఎస్ఈ వెంకటయ్య, ఈఈ నూనె శ్రీధర్, డీసీ దస్తగిరి, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, తిమ్మాపూర్ యూనిట్ అధ్యక్షుడు పోలు కిషన్, సంఘం సభ్యులు మామిడి రమేష్, గంగారపు రమేష్, రాగి శ్రీనివాస్, ధనలక్ష్మి, అశోక్ రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న డీఈవో, ఎంఈవో తదితరులు

పీడీ సారయ్య సేవలు నిస్వార్థం

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల పీడీగా సొల్లు సారయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు హాజరై మాట్లాడారు. సారయ్య పీఈటీ, పీడీగా అనేక మంది పిల్లలను కబడ్డీ, ఖోఖో, ఇతర క్రీడల్లో నిష్ణాతులు చేశారని, ఎంతో మంది జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారని, ఆయన సేవలు నిస్వార్థమన్నారు. అనంతరం పీడీ దంపతులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎం బొరగాల తిరుమల, ఈశ్వర్‌రెడ్డి, ఆసియా, రాములు, సంపత్, మారుతి, ప్రసాద్, రవికుమార్, రవీందర్, రిటైర్డ్ పీడీ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న సాబిర్‌అలీ, బాధిత కుటుంబ సభ్యులు

జమ్మికుంట: జమ్మికుంట టౌన్ సీఐ అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలని సామాజిక కార్యకర్త షేక్ సాబిర్ అలీ, బాధిత కుటుంబ సభ్యులతో కలిసి డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం సీఐ బాధిత కుటుంబ సభ్యులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. అంబాల రాజు, కాటిపల్లి లక్ష్మి, ఠాగూర్ సుశీల గతంలో పలుమార్లు ఫిర్యాదుల్లో అన్యాయం చేశారని, వీడియో రికార్డులను విడుదల చేశారు. అంతేకాకుండా డిపార్ట్‌మెంట్ విచారణ కాకుండా సిట్ విచారణ చేయాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులను కోరారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న పోలీసు మిత్రులు

రామడుగు: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1995 బ్యాచ్‌కు చెందిన పోలీస్ మిత్రులు రూ.1.90 లక్షలు శుక్రవారం మృతుడి కుటుంబానికి అందజేశారు.

నేడు న్యాయచైతన్య సదస్సు

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఇక్ఫాయి లా స్కూల్ ఆధ్వర్యంలో శనివారం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించనున్నామని నిర్వాహకుడు, మాజీ సర్పంచు లుక్క రాజేశం తెలిపారు. చట్టాలపై అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న సదస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ, పలువురు న్యాయమూర్తులు హాజరై పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

రామడుగు: రామడుగు సహకార బ్యాంకు మాజీ చైర్మన్, వెలిచాల శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు ఇటీవల శస్త్రచికిత్స చేసుకోగా మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ శుక్రవారం ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మూగజీవాలను హింసించొద్దు



బహుమతులు అందజేస్తున్న రవికుమార్

హుజూరాబాద్: మూగ జీవాలను హింసించొద్దని పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ అన్నారు. మండలంలోని సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో జంతుసంరక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకొని హెచ్‌ఎం, ఎంఈవో భూపతి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మూగజీవాల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంట్లో పెంచుకునే జంతువులకు టీకాలు వేయించాలన్నారు. ఇంటివద్ద పాడిపశువుల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలోని పశువైద్య కేంద్రంలో కుక్కలకు పశువైద్యాధికారి టీకాలు వేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వినోద్, సింగాపూర్ పశువైద్యాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి,ఉపాధ్యాయ బృందం, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

మద్యం సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలి



ఎక్సైజ్ ఆఫీస్‌లో ఫిర్యాదు చేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

హుజూరాబాద్: హుజూరాబాద్‌లో మద్యం మాఫియా సిండికేట్‌గా ఏర్పడి నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తుందని, ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ సభ్యులు శుక్రవారం ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ కో కన్వీనర్ కాయిత రాములు మాట్లాడుతూ.. పెద్ద మొత్తంలో డబ్బులు దండుకొని బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం సమీపంలో మా ఇల్లు మాకు కావాలంటూ హుజూరాబాద్ జర్నలిస్టులు చేపట్టిన నిరసన శుక్రవారంతో ఐదో రోజుకు చేరింది. నిరసన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సమావేశంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ)జిల్లా నాయకులు నంబి భరణి కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షుడు మక్సుద్, చిలుకమారి సత్యరాజ్, బొడ్డు శ్రీనివాస్,ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవన్‌రెడ్డిపై స్కావెంజర్ కోండ్ర కనకయ్య శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కులం పేరుతో దూషిస్తున్నాడని, తనభార్య లక్ష్మి మధ్యాహ్న భోజనం వండకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. అధికారులు న్యాయం చేయాలని విన్నవించాడు.

భూమి కోసం ఆందోళన

గన్నేరువరం: భూమి కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద యువ రైతు శుక్రవారం ఆందోళన చేపట్టాడు. మండలంలోని గుండ్లపల్లికి చెందిన చెందిన బేతేల్లి నారాయణరెడ్డికి శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి కొడుకులు, కుమార్తె వసంత ఉన్నారు. వసంతకు వివాహం కాగా సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరంలో నివాసం ఉంటోంది. శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆయన భార్య గతంలో మృతిచెందారు. వీరి కూతురు ప్రియాంక సైతం మృతి చెందింది. వీరికి రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. భూమి కోసం సంజీవరెడ్డి, వసంత కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా వివాదం జరుగుతోంది. సంజీవరెడ్డి కుమారుడు రాజు, తల్లి శ్యామల, సోదరితో కలిసి అందోళన చేపట్టారు. భూమి కోసం తన తండ్రిని కొందరు కిడ్నాప్ చేశారని, భూమిని ఎవరికి విరసత్ చేయొద్దని, న్యాయం చేయాలని కోరాడు. ఇప్పటి వరకు ఎవరికి విరాసత్ చేయలేదని తహసీల్దార్ నరేందర్ తెలిపారు.

అధికారుల నిలదీత

చిగురుమామిడి: కాల్వల తవ్వకాల్లో భూములు కోల్పోతున్న తమకు ఎకరాకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఎంతో చెప్పకుండా సంతకాలు చేయమంటే ఎలా అని మండలంలోని కొండాపూర్ గ్రామస్తులు భూనిర్వాసితులు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట భూనిర్వాసితులతో గ్రామసభ నిర్వహించారు. ప్రస్తుత మార్కెట్ ప్రకారం ఎకరాకు రూ. 40 లక్షలు చెల్లించేవరకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. అవార్డు ఎంక్వైరీ గ్రామసభలో భూసేకరణ విభాగం సినియర్ అసిస్టెంట్ రజని, ఇరిగేషన్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి అమృతవర్షిని, ఆర్ఐ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటోమొబైల్ రంగంలో కొత్త ఆవిష్కరణలు

హుజూరాబాద్: ఆటోమొబైల్ రంగంలో ఆకొత్త ఆవిష్కరణలు వస్తున్నాయని భోపాల్ ఎన్ఐటీ టెక్నికల్ టీచర్స్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. సువర్ణరాజు అన్నారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు మెకానికల్‌కు సంబంధించిన అంశాలను నేర్చుకోవాలన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రియల్ టైం ప్రాజెక్టు చేస్తున్నారని, సదుపాయాలు, ప్రోత్సాహాలను అందిస్తున్నామని వివరించారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి



హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని ప్రమాదరహిత డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లకు సన్మానోత్సవ కార్యక్రమం డిపో మేనేజర్ రవీంద్రనాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హుజూరాబాద్‌టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకమని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లు ఆగయ్య, శ్రీనివాస్ ఈఆర్‌రావు, పీఎస్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602934, 9951602933, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముందయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 8573106760
హుజూరాబాద్ : రాములు - 9160083195
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899